ఈనాడు అన్నమయ్య
గురువారం సెప్టెంబరు 26, 2024 5

పారదర్శకంగా ఇసుక సరఫరా : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, పక్కన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, అధికారులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో పారదర్శకంగా ఇసుక సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. విజయవాడలోని గనులు,భూగర్భశాఖ కార్యాలయం నుంచి ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆయా జిల్లాల కలెక్టర్లతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో అమలవుతున్న ఉచిత ఇసుక విధానంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న విధానంపై కలెక్టర్ వివరించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, గనులశాఖ అధికారి రవిప్రసాద్, జిల్లా రవాణాశాఖ అధికారి భరత్, తదితరులు పాల్గొన్నారు.

దసరాకు 230 ప్రత్యేక బస్సులు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా 230 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల్లో వృత్తిరీత్యా, వివిధ రకాల చదువులు చదువుకుంటున్న వారందరిని పండగకు సొంత ఊళ్లకు తీసుకొచ్చేందుకు అక్టోబరు 8 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యముందన్నారు. హైదరాబాద్ నుంచి 90 బస్సులు, బెంగళూరు నుంచి 70, విజయవాడ నుంచి 30, చెన్నై నుంచి 10 బస్సులు చొప్పున ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు కూడా 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అక్టోబరు 7, 8 తేదీల్లో తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. దూరప్రాంత ఉద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌర్ణమి సందర్భంగా అక్టోబరు 16న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం తెలిపారు.

పల్లెపల్లెకు రహదారులు!

రహదారుల్లేని గ్రామాలు: 226
100 జనాభా లోపువి: 79
100 నుంచి 249 వరకు: 121
250 నుంచి 499 జనాభా: 22
500 కంటే అధికంగా ఉన్నవి: 4

- ఉమ్మడి కడప జిల్లాలో 226 గ్రామాలకు మోక్షం
- ఏడాదిలోగా నిర్మించాలని ఎన్డీయే సర్కారు లక్ష్యం
- స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

రహదారుల్లేని గ్రామాలకు త్వరలో మోక్షం కలగనుంది. ఈ మేరకు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రాధాన్యమిచ్చారు. తరాలు మారినా తలరాతలు మారలేదన్నట్లుగా పలు గ్రామాలు రహదారులకు నోచుకోలేదు. ఉమ్మడి కడప జిల్లాలో 226 గ్రామాలను గుర్తించి ఏడాదిలోగా రహదారులను నిర్మించాలని పంచాయతీరాజ్‌శాఖ ప్రణాళిక రూపొందించింది. దశల వారీగా చర్యలు చేపట్టడానికి కసరత్తు చేపట్టింది.

– ఈనాడు, కడప

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా, మండలాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలందాయి. రహదారుల్లేని గ్రామాలను గుర్తించి వెంటనే నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు ముమ్మర కసరత్తు చేసిన విభాగం ఉమ్మడి కడప జిల్లాలో 226 గ్రామాలు రహదారికి నోచుకోనివి ఉన్నట్లు లెక్కలు తేల్చారు. 500 జనాభా కంటే అధిక జనాభా ఉన్న గ్రామాలు 4, 250 నుంచి 499 వరకు 22, 100 నుంచి 249 వరకు 121, 100 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలు 79 వంతున మొత్తంగా 226 వరకు ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాలకు వచ్చే ఏడాది లోపు రహదారి సౌకర్యం కల్పించేవిధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పల్లెలకు కనీసం రహదారి మార్గాలు కల్పించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లయినా కనీసం రోడ్డుకు నోచుకోని పల్లెలుండడాన్ని గుర్తించారు. గతంలో 500 కంటే అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి రహదారులు నిర్మించారు. దాదాపు నిర్మాణాలు చేపట్టినప్పటికీ జనాభా పెరిగిన తరుణంలో ఈ కేటగిరి జాబితాలో నాలుగు చేరాయి. మరికొన్ని చోట్ల కొత్తగా కాలనీలు ఏర్పాటు కావడం, జగనన్న కాలనీల పేరిట నిర్మాణాలు చేపట్టడంతో రహదారుల ఆవశ్యకత ఏర్పడింది. వీటన్నింటికీ ఎన్డీయే ప్రభుత్వం మోక్షం కల్పించే దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ విభాగం మంత్రిత్వశాఖను చూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలి ప్రాధాన్యంగా రహదారులు లేని గ్రామాలకు ప్రాధాన్యమిచ్చే దిశగా సన్నాహాలు చేస్తున్నారు. బీటీ, సిమెంటు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.



రాయచోటి మండలం కురవపల్లె గ్రామానికి వెళ్లే మట్టి రహదారి

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

రహదారుల్లేని గ్రామాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. ఏడాది లోగా రహదారుల్లేని గ్రామాలు ఉండరాదనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉమ్మడి కడప జిల్లాలో మండలాల వారీగా కసరత్తు చేస్తున్నాం. రహదారుల మరమ్మతులు సైతం ప్రాధాన్య క్రమంలో చేపట్టబోతున్నాం.

- శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం

తప్పు చేసినవారికి శిక్ష తప్పదు

- తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారంపై విచారణకు సిట్ ఏర్పాటు
- జడ్పీ వాణిజ్య సముదాయం ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన కలెక్టర్ శివశంకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ శారద, ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, అధికారులు, నాయకులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: 'గత వైకాపా హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని గుజరాత్‌కు చెందిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ధ్రువీకరించింది. దీనిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసింది. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు చేసినవారికి శిక్ష తప్పదు' అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలో రూ.4.5 కోట్లతో నిర్మించిన జిల్లాపరిషత్తు వాణిజ్య సముదాయాన్ని బుధవారం ఆయన కలెక్టర్ శివశంకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ శారద, కడప, కమలాపురం, రాజంపేట ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, అమరనాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం పూజాకార్యక్రమాలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జడ్పీ పరిధిలో ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్తు ప్లాంటును ప్రారంభించి పని తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గత వైకాపా పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఎన్డీయే ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, సీఈవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, పోరుమామిళ్ల జడ్పీటీసీసభ్యుడు ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు ప్రారంభోత్సవంలో భాగంగా కొన్ని గదులకు కట్టిన రిబ్బన్లను వైకాపా నాయకులు కత్తిరించడం గమనార్హం.

ఎన్నాళ్లీ అవస్థలు?



గ్రామీణ రహదారుల నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేయడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడినచోట మరమ్మతులు చేయకుండా వదిలేశారు. సిద్దవటం- పి.కొత్తపల్లికి వెళ్లే మార్గంలో ఎస్.రాజంపేట సమీపంలో తారు తేలిపోయి, పెద్ద గుంతలతో రహదారి ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో పెన్నానది నుంచి ఇసుకను భారీ వాహనాల్లో అధిక లోడుతో తరలించడంతో రహదారి దెబ్బతింది. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఎన్నాళ్లీ అవస్థలు పడాలని, ఎన్డీయే ప్రభుత్వం దృష్టి సారించి మరమ్మతులు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు. **- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

అదును చూసి... చదును చేసి

జగనన్న కాలనీ స్థలం, సమీప గుట్ట కబ్జా

జగనన్న కాలనీ స్థలంతోపాటు సమీపంలోని గుట్టను ఓ నేత యంత్రాలతో చదును చేసి ఆక్రమించేశారు. సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామసమీపంలోని ఒంటిల్లు సచివాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గత వైకాపా ప్రభుత్వంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. కాలనీలో బోరు వేసి మోటారు అమర్చి విద్యుత్తు సౌకర్యం సైతం కల్పించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రాంతానికి చెందిన ఓ నేత యంత్రాలతో ప్లాట్ల కోసం వేసిన హద్దు రాళ్లను సైతం తొలగించి చదును చేయడంతో పాటు సమీప గుట్టను కూడా కొంతమేర చదును చేసి ఆక్రమించేశారు. దీనిపై జనసేన పార్టీ నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదులు సైతం చేశారు. ఈ విషయమై తహసీల్దారు దైవాదీనం మాట్లాడుతూ ఆక్రమణ జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే పరిశీలించి నివేదిక ఇవ్వాలని సర్వేయరు, వీఆర్వోలను ఆదేశించామన్నారు. సర్వే అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సుండుపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన బోరును స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.



- సుండుపల్లి, న్యూస్‌టుడే

పాలకొండల్లో జల సోయగం!



గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాలకొండల నుంచి జలపాతం జాలువారుతూ కనువిందు చేస్తోంది. కడప నగరానికి ఆనుకుని ఉన్న ఈ కొండల నుంచి వస్తున్న నీటిని వీక్షించేందుకు యువత పెద్దఎత్తున వస్తోంది. జలపాతం వద్ద యువతీ యువకులు, చిన్నారులు, పెద్దలు కేరింతలు కొడుతూ ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు తీసుకోవాలని సందర్శకులు, నగరవాసులు కోరుతున్నారు.

- ఈనాడు, కడప

పాఠశాలల్లో క్రీడల్!

- అభివృద్ధికి నోచుకోని మైదానాలు
- ఎన్డీయే సర్కారుపై గంపెడాశలు

న్యూస్‌టుడే, రాయచోటి, రామాపురం



రామాపురం గురుకుల పాఠశాలలో పిచ్చిమొక్కలతో నిండిన క్రీడామైదానం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయి. అయిదేళ్ల కిందట సందడిగా ఉన్న మైదానాలు గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఇరుకైన ప్రదేశాలలోనే విద్యార్థులు ఆటలు ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వీటిని చక్కదిద్దేందుకు ఎన్డీయే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

◆ గత వైకాపా ప్రభుత్వ పాలనలో తరగతి భవనాల కొరతపైనే అధికారులు దృష్టి సారించారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన క్రీడలను నిర్లక్ష్యం చేశారు. అందుకు అవసరమైన మైదానాలు అభివృద్ధి పరచలేదు. జిల్లాలో 1,735 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 304 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 1,42,238 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గాలివీడు, వీరబల్లి, చెన్న ముక్కపల్లి, మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలకు దాతలు ఇచ్చిన స్థలాల్లోనే భవనాలు నిర్మించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాలను మైదానాల కోసం సేకరించాల్సి ఉన్నా అధికారులు అప్పట్లో దృష్టిసారించ లేదు. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఇప్పుడు మైదానాలకు స్థల సేకరణ సమస్యగా మారింది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మైదానాల అభివృద్ధిపై దృష్టి సారించి క్రీడలను ప్రోత్సహించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

గతంలో ఇలా...

జిల్లాలో నాడు-నేడు కింద తొలి, మలి విడతలో సుమారు రూ.280 కోట్లకుపైగా నిధులు వెచ్చించారు. అదే సమయంలో మైదానాలను బాగు చేసి ఉంటే నేడు క్రీడాకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేదని వ్యాయామోపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో మైదానాలకు కనీసం అయిదు నుంచి 10 ఎకరాల స్థలం కేటాయించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం మైదానాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం నిధులు వినియోగించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మైదానాల్లోని ముళ్లపొదలు తొలగించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.

ఇదీ పరిస్థితి...

◆ రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడామైదానం అభివృద్ధికి గత వైకాపా ప్రభుత్వం రూ.కోటి నిధులు వెచ్చించింది. పనులు అసంపూర్తిగానే నిలిచిపోవడంతో క్రీడల నిర్వహణకు మౌలిక వసతులు కరవయ్యాయి. ◆ రామాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో విశాలమైన క్రీడా మైదానం ఉంది.. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ గుత్తేదారు పూర్తిగా నిర్మించలేకపోయారు. వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు చేయలేని పరిస్థితి వచ్చిందని బహిరంగంగా చెప్పుకొంటున్నారు. ◆ రాయచోటిలోని రాయుడుకాలనీ, డైట్, లక్కిరెడ్డిపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై వ్యాయామవిద్య రాష్ట్ర సంచాలకులు జి.భానుప్రతాప్‌రాజు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో మైదానాల అభివృద్ధి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతుల కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కొండయ్య

వీరబల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు ఇబ్బందుల్లేకుండా సకాలంలో మెరుగైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో కొండయ్య పేర్కొన్నారు. వీరబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. అత్యవసర చికిత్స అవసరమైనవారిని జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ప్రాంతీయాసుపత్రికి తరలించి తమకు వెంటనే తెలియజేయాలన్నారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో చాలా మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలో విధుల్లోకి వస్తారన్నారు. ఆయనవెంట సీహెచ్‌వో సుధాకర్, సిబ్బంది తదితరులున్నారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ


కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అక్టోబరు 10వ తేదీ నుంచి నిరుద్యోగ గ్రామీణ యువతకు సెల్‌ఫోన్ రిపేరింగ్-సర్వీసింగ్ (30 రోజులు), ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీ (30 రోజులు), సీసీటీవీ కెమెరాలు-ఇన్‌స్టలేషన్-రిపేరింగ్ (13 రోజులు)లకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టరు ఆరీఫ్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లగల నిరుద్యోగ యువకులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాస్ఫేట్ కొంటేనే యూరియా

- వరి రైతులపై అదనపు భారం
- ఉమ్మడి కడప జిల్లాలో దుస్థితి

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ఉమ్మడి కడప జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 41 వేల హెక్టార్లు కాగా, 37 వేల హెక్టార్లలో సాగైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వరి సాగులో ఎకరాకు సుమారు మూడు బస్తాల యూరియాను రైతులు వినియోగిస్తారు. ఇదే అదనుగా తీసుకుని కొందరు ఎరువులు వ్యాపారులు పాస్ఫేట్ కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. తమకు యూరియా మాత్రమే కావాలని రైతులు కోరుతున్నా వ్యాపారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపించినప్పుడే ఆయా గ్రామాలకు చేరుతోంది. వ్యవసాయాధికారులు మాత్రం ఆయా కేంద్రాల్లో అవసరమైన మేరకు రవాణా చేస్తున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులతోపాటు కౌలు రైతులు యూరియా కొనుగోలుకు ప్రైవేటు ఎరువుల దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రొద్దుటూరులో కొందరు ప్రైవేటు ఎరువుల దుకాణదారులు ఎమ్మార్పీ ధర కన్నా బస్తాకు రూ.5 నుంచి రూ.15 దాకా అధికంగా వసూలు చేస్తున్నారు.



తాళ్లమాపురంలో సాగవుతున్న వరి పంట

పాస్ఫేట్ కొనాల్సిందేనట



రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరియా కొనాలంటే పాస్ఫేట్ తీసుకోవాల్సిందేనని వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారు. అవసరం లేకున్నా పాస్ఫేట్ విక్రయాలు జరుపుతున్నారు. దీంతో మాపై అదనపు భారం పడుతోంది.

- పసుపుల నరసింహులు, నాగాయపల్లె

పర్యవేక్షణకు ఆదేశాలిస్తాం

రైతులకు అవసరమైన యూరియాను మాత్రమే ప్రైవేటు వ్యాపారులు విక్రయించాలి. పాస్ఫేట్ కొంటేనే యూరియా ఇస్తామనడం సరికాదు. వెంటనే ఎరువుల దుకాణాలను పర్యవేక్షించాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశిస్తాం.

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, వైఎస్ఆర్

దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు : నల్లారి

కలికిరి (వాల్మీకిపురం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజాపాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని, వాల్మీకిపురం ప్రజలకు నల్లారి కుటుంబం రుణపడి ఉంటుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురం తహసీల్దారు కార్యాలయం, చింతపర్తి పంచాయతీ ఆవరణలో వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి ఉందని ప్రాధాన్యత క్రమంలో.. ప్రణాళిక బద్ధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. వంద రోజుల్లో వందకు పైగా హామీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ఒక్కచాన్స్ అంటూ జగన్ ప్రజల్ని నానా చేశారని, అన్ని రంగాలను నిర్వీర్యం చేసినట్లు ఆరోపించారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల హామీ అమలు చేస్తున్నారు. మూడు నెలల్లో మంచి పాలనను అందించిన ప్రజల ప్రభుత్వంగా గుర్తింపు పొందుతున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు, పొలం పిలుస్తోంది కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటి నీరుపోశారు. వైద్యులతో సమావేశం నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి, తెదేపా నాయకులు సాకిరేవపల్లె కృష్ణారెడ్డి, గుర్రం మల్లికార్జునరెడ్డి, వల్లిగట్ల వెంకట్రమణ, గాండ్లపేట రమణ, మాజీ సర్పంచి రాజేంద్రప్రసాద్, పీవీ నారాయణ, కోసూరి చంద్ర, టమాట రామచంద్ర, డిప్యూటీ దర్శి సురేంద్రరెడ్డి, మహితశ్రీపతిరెడ్డి, పులి సత్యనారాయణ రెడ్డి, చెరుకు ద్వారకనాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిలో మొక్క నాటుతున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

విద్యార్థుల్లో విజ్ఞానం... పురస్కారంతో ప్రోత్సాహం

అక్టోబరు 15 వరకు ప్రేరణ దరఖాస్తు గడువు

జిల్లాలో 1,100 నామినేషన్ల నమోదు

పీలేరు, మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని పాఠశాల స్థాయి నుంచి వెలికి తీసి వారిలో శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక సృజనాత్మక ఆలోచనలను పెంచేందుకు ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ పేరుతో పురస్కారాలను అందజేస్తోంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈ ప్రోత్సాహం అందిస్తున్నారు. 2024-25 సంవత్సరానికి గాను జులై 15 తేదీ నుంచి సెప్టెంబరు 15వ తేదీ వరకు ఇన్‌స్పైర్ ప్రాజెక్టులకు దరఖాస్తు గడువు ఇచ్చారు. అయితే ఈ గడువును అక్టోబరు 15 వరకు పెంచారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,100 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య సగానికి తగ్గింది. గడువులోగా వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు నమోదయ్యేలా అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.


సైన్స్ ప్రాజెక్టు తయారు చేస్తున్న విద్యార్థులు

ఇలా నమోదు చేసుకోవాలి

ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్‌కు అర్హులు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి అయిదు నామినేషన్లను పంపాల్సి ఉంటుంది. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఇన్‌స్పైర్ అవార్డ్-డీఎస్‌టీ.జీవోవి.ఇన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. పాఠశాల అథారిటీ ఐకాన్‌పై క్లిక్ చేసి వన్‌టైం రిజిస్ట్రేషన్ చేసి పాఠశాల వివరాలను పొందుపర్చాలి. జిల్లా విద్యాశాఖ నుంచి ఆమోదం లభించిన తర్వాత ఈమెయిల్, యూజర్ ఐడీతో లింక్ వస్తుంది. పాస్‌వర్డ్ నమోదు చేసి ప్రాజెక్టు నమూనాకు సంబంధించిన వివరాలు పొందుపర్చాలి. ప్రాజెక్టు ఎంపికైతే రూ.10 వేలు ప్రాజెక్టు నిర్మాణానికి వస్తుంది. అలాగే జాతీయస్థాయికి ఎంపికయ్యే ప్రాజెక్టును మెరుగు పర్చుకునేందుకు రూ.25 వేల వరకు శాస్త్ర సాంకేతిక మండలి అదనపు నిధులు కేటాయిస్తుంది.

ఏఏ అంశాల్లో దరఖాస్తు చేసుకోవాలంటే...

శాస్త్రీయంగా సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు, ఆవిష్కరణలను ఎంపిక చేసుకోవాలి. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించాలి.

2023-24 ప్రదర్శనలు జరిగేనా!

2023-24 సంవత్సరానికి గాను 2,700 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఇందులో జిల్లా స్థాయికి 326 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు జరగలేదు. ఈ విద్యార్థులు ఇప్పటికీ పోటీల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రేరణకు ఎంపికైన వారి వివరాలు

జిల్లా కొత్తగా ఏర్పడినప్పటి నుంచి రెండు సంవత్సరాలు ఇన్‌స్పైర్ కార్యక్రమాలు జరిగాయి. ఇందులో మొదటి సంవత్సరం జాతీయ స్థాయి వరకు విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. రెండో సంవత్సరం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు జరగలేదు. ఇప్పుడు కొత్తగా 2024-25 సంవత్సరానికి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.

సంవత్సరం	నామినేషన్లు	ఎంపికైనవి	రాష్ట్రస్థాయి	జాతీయ స్థాయి
2022-23	2,040	245	21	2
2023-24	2,700	326	జరగలేదు	జరగలేదు

★ 2024-25 సంవత్సరానికి గాను ఇప్పటి వరకు 1,100 నామినేషన్లు మాత్రమే దరఖాస్తు చేశారు. ఈ సంఖ్య పెరిగే దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చొరవ చూపాల్సి ఉంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొనడం వల్ల సైన్స్ పట్ల మక్కువ పెరుగుతుంది. అలాగే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఉత్తమంగా నిలిచిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి అక్కడ అర్హత సాధిస్తే జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ స్థాయిలో ప్రాజెక్టులకు ప్రభుత్వం పేటెంట్ కూడా అందిస్తుంది. జాతీయ స్థాయిలో రాణిస్తే ప్రధానిని కూడా కలవచ్చు. సాధ్యమైనంత మంది ఎక్కువ ప్రాజెక్టులు నమోదు చేసుకునేలా ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహం అందించాలి.

- ఎం.ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

ప్రతిభావంతురాలి చదువుకు పేదరికమే అడ్డంకి

ఇంజినీరింగ్ ఫీజు చెల్లించలేక అగచాట్లు

పెద్దమండ్యం, ములకలచెరువు, న్యూస్‌టుడే : ఆమె పేదింటి ఆణిముత్యం... చదువుల్లో మేటి... అయితేనేం పేదరికం ఆమె ఉన్నత చదువులకు అడ్డంకిగా మారింది... ఇంజినీరింగ్ చేయాలన్న ఆ విద్యార్థిని కల నెరవేరాలంటే దాతలు కరుణించాల్సిందే. తండ్రి అనారోగ్యంతో మంచాన పడగా, తల్లి పనులకు వెళ్లితే ఆ ఇల్లు గడిచేది. అలాంటిది తమ బిడ్డను ఉన్నత చదువులు ఎలా చదివించాలని తల్లిదండ్రులు తమ నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన రేష్మా దుస్థితి ఇది.


హోటల్‌లో అంట్లు తోముతున్న రేష్మా తల్లి

★ పెద్దమండ్యం మండలంలోని కలిచెర్లకు చెందిన నిరుపేద విద్యార్థిని రేష్మా. కలిచెర్లకు చెందిన హసీనా ప్యారీ, మహబూబ్‌బాషాకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి రేష్మా, కుమారుడు బాషా 9వ తరగతి చదువుతున్నాడు. వీరికి సొంతిల్లు కూడా లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నారు. జీవనాధారం లేకపోగా మహబూబ్ బాషాకు వచ్చే పింఛను ఆయన మందులకే సరిపోతోంది. ఇక తల్లి హోటల్‌లో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని ఎలాగోలా నడిపిస్తోంది. రేష్మా పదో తరగతిలో 515, ఇంటర్‌లో 957 మార్కులు సాధించారు. ఇంజినీరింగ్ చేయాలన్నది తన లక్ష్యం కాగా ఈ మేరకు ఎంసెట్ పరీక్ష రాయగా 55,650 ర్యాంకు వచ్చింది. దీంతో చిత్తూరు జిల్లా పుత్తూరు ఇంజినీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది. ఇంత వరకు బాగానే ఉంది. కానీ అక్కడ చేరడానికి వసతి గృహంలో ఉండాలి. హాస్టల్ ఫీజు రూ.70 వేలు, ఇతర ఫీజులు చెల్లించాలి. వీరి దగ్గర అంత డబ్బు లేకపోవడంతో ఇంటి దగ్గరే ఉండిపోయింది. చుట్టుపక్కల వారికి విషయం తెలియడంతో తలా కొంచెం డబ్బు పోగేసి రూ.5 వేలిచ్చి ఇంజినీరింగ్ విభాగంలో చేర్పారు. మిగిలిన డబ్బులు ఈ నెలాకరుకల్లా కట్టాలని ఎవరైనా ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది రేష్మా. దాతలు స్పందించి ఆదుకుంటే ఆమె ఇంజినీరింగ్ విద్య పూర్తవుతోంది. ఓ పేదింటి కుసుమం కల నెరవేరుతుంది.

ఆర్థిక ఇబ్బందులే కారణం



అమ్మ ఓ హోటల్‌లో పాత్రలు తోమి వారిచ్చిన దాంతో కుటుంబాన్ని పోషిస్తోంది. మా నాన్న దివ్యాంగుడు, ఆరోగ్యం కూడా క్షీణించింది. ఆయనకు వచ్చే పింఛను మందులకు సరిపోతున్నాయి. వారి బాధను చూసి చదువు నిలిపేయాలని అనిపించింది. చుట్టుపక్కల వారు చదువుకొమ్మని కొంత సాయం చేయడంతో ఇంజినీరింగ్‌లో చేరా. బాగా చదువుకుని ఇంజినీరు కావాలని ఆశపడుతున్నారు. దాతలు సాయం చేస్తారని ఆశిస్తున్నాను. **- రేష్మా, విద్యార్థిని**

దాతలు సంప్రదించాల్సిన నంబరు : 9154991003

ఎక్సైజ్ నేరాల కట్టడికి కృషి



కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప, అన్నమయ్య జిల్లాల ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అదనపు కమిషనర్‌గా **వి.చంద్రశేఖర్‌రెడ్డి** బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ నేరాల కట్టడికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్కూల్ గేమ్స్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 27 నుంచి ప్రారంభమౌతుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. అండర్-17 నెట్‌బాల్ పోటీలు ఈ నెల 27వ తేదీ సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. 28న అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీలు బీటీ కళాశాల మైదానంలో, అండర్-14 వాలీబాల్ పోటీలు ఈ నెల 30వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అండర్-17 హాకీ అక్టోబరు 1వ తేదీన సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. ఈ పోటీలన్నీ ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతాయన్నారు. అండర్-14 క్రీడాకారులు 2011 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. అండర్-17 క్రీడాకారులు 2008 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వైద్య కళాశాలలో ప్రవేశానికి నిమ్మనపల్లె ఆదర్శ విద్యార్థి ఎంపిక

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో వైద్యవిద్య ప్రవేశానికి నిమ్మనపల్లె మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థి మహమ్మద్ షాహిద్ ఖాన్ ఎంపికయ్యాడు. 2023లో ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన ఈ విద్యార్థి నీట్ 2024లో ప్రవేశ పరీక్ష రాయగా ఆల్ ఇండియాలో 25,769 ర్యాంకు రాగా, ఆంధ్రప్రదేశ్‌లో 546 ర్యాంకు సాధించాడు. మదనపల్లెకు చెందిన హఫీజ్‌ఖాన్ ఫరాహత్‌భాను కుమారుడైన మహమ్మద్ షాహిద్‌ఖాన్ చదువులో చురుగ్గా ఉండేవాడు. నీట్‌లో ర్యాంకు సాధించడం, వైద్య కళాశాలలో సీటుపొందడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ కేవీఎస్‌ఎన్‌మూర్తి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


మహమ్మద్ షాహిద్‌ఖాన్

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వలసపల్లెలోని నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ గోవిందరావు తెలిపారు. అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించారని అర్హులైన విద్యార్థులు జేఎన్‌వీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, జనరల్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, గ్రామీణ, పట్టణ, వైకల్యం, పరీక్ష మాధ్యమం విషయాల్లో ఆన్‌లైన్‌లో మార్పులకు అక్టోబరు 8, 9 తేదీల్లో అవకాశం ఉంటుందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వంచే గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లడ్డూ కల్తీ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉప ముఖ్యమంత్రి ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూను కల్తీ చేసిన నిందితులను చట్టపరిధిలో శిక్షించాలని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ మైఫోర్స్ మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం మహేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం ఎదుట 100 టెంకాయలు కొట్టి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో హిందూ దేవాలయాలపై దాడులు చేసి ధ్వంసం చేశారని, నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల లడ్డూను కల్తీ చేసి వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గుంటూరులో గత మూడు రోజులుగా తిరుమలలో జరిగిన సంఘటనపై దీక్ష చేస్తున్నారని, 11 రోజుల ఈ దీక్ష పూర్తి చేసి తర్వాత తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని తెలిపారు. ఆయన చేపట్టిన దీక్షకు సంఘీభావంగా మదనపల్లెలో ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఆయనకు మద్దతుగా పార్టీ శ్రేణులు కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సందీప్‌రెడ్డి, ఆంజినేయులు, రామసముద్రం మండలం అధ్యక్షుడు చంద్ర, జిల్లా కార్యదర్శి సనావుల్లా, విశ్వనాథ్, లక్ష్మీపతి, చిరంజీవి, రమణారెడ్డి, రెడ్డెప్ప, శంకర్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరికాయలు కొట్టి సంఘీభావం తెలుపుతున్న జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్, నాయకులు

సమ్మిళిత అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రజాభిప్రాయంలో స్వచ్ఛందంగా పాల్గొని సమ్మిళిత అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీధర్ సూచించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బుధవారం స్వచ్ఛతా హీ సేవ, ఇది మంచి ప్రభుత్వం, సామాజిక పింఛన్లు తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, పురపాలక కమిషనర్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర-2047పై కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. సచివాలయ సంక్షేమ కార్యదర్శులు సోమ, గురువారాల్లో పాఠశాల మరుగుదొడ్లను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, సీపీవో వెంకటపెద్దయ్య అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి షటిల్ క్రీడలకు ఇద్దరి ఎంపిక

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడులోని కేరళ పాఠశాలకు చెందిన షేక్ మహమ్మద్ ఆఫ్రిద్, లినో డోనమిక్ జిల్లా స్థాయి షటిల్ పోటీలకు ఎంపికయ్యారు. రాయచోటిలో బుధవారం నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు జరిగాయి. అందులో అండర్-17, అంగర్-14 విభాగంలో ఇద్దరు క్రీడాకారులు షటిల్ క్రీడలో ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

పథకాలతో ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి

మదనపల్లె గ్రామీణ, నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సమన్వయకర్త సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాతీయ స్థాయి సమన్వయ సంఘం కన్వీనర్‌తో కలిసి మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో పర్యటించారు. ఇంకుడు గుంతలు, మహిళా సమాఖ్య కార్యకలాపాలను పరిశీలించారు. వేంపల్లె గ్రామ పంచాయతీ సచివాలయ ఆవరణలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మహిళా సమాఖ్యల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, పంచాయతీ గ్రామసభల్లో భాగస్వామ్యమై గ్రామ పంచాయతీ వనరుల పెంపుదలకు, అభివృద్ధి ప్రణాళికలకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించి వీటిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచి ఆదెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్, పంచాయతీరాజ్ ఏఈ వెంకట రమణ, ఏవో రెడ్డెమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీవో సుబ్రహ్మణ్యం, తెదేపా రైతు నాయకులు దొరస్వామి నాయుడు పాల్గొన్నారు.


మహిళా సమాఖ్య సభ్యులతో చర్చిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సమన్వయకర్త సుధాకర్‌రెడ్డి, పక్కన అధికారుల బృందం

కంప్యూటరైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తవ్వాలి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తవ్వాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, సూపర్‌వైజర్లు, డీసీసీబీ సీఈవోలతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖాధికారి గురుప్రకాష్ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ పురోగతిపై జేసీకి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. .. ఇప్పటి వరకు సాధించిన పురోగతిని కొనసాగిస్తూ... రాబోయే అయిదు రోజుల్లో వంద శాతం పురోగతిని సాధించాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, సూపర్‌వైజర్లు, డీసీసీబీ సీఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్, పక్కన అధికారులు

ట్రాన్స్‌కోలో ఏడీఈ, ఏఈల బదిలీ

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : ట్రాన్స్‌కోలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ట్రాన్స్‌కో రూరల్ ఏడీఈగా హరికుమార్ నియమితులు కాగా, ఈ స్థానంలో పనిచేస్తున్న జీవన్‌కుమార్‌రెడ్డి చిత్తూరు రూరల్‌కు బదిలీ అయ్యారు. పట్టణంలోని నార్త్ ఏఈగా అజయ్‌బాబు నియమితులు కాగా, ఈ స్థానంలోని నరసింహారెడ్డి పుంగనూరుకు, మదనపల్లె కమర్షియల్ విభాగానికి ఏఈగా చంద్రమౌళి నియమితులయ్యారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోటకు నాగరాజు, పెద్దమండ్యంకు శంకర్‌రెడ్డి, తంబళ్లపల్లెకు శేషకుమార్, పీటీఎంకు ఉత్తన్న, బి.కొత్తకోటకు గిరి ఏఈలుగా కొనసాగుతున్నారు.

చోరీకి గురైన ద్విచక్ర వాహనాల లభ్యం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లెలో చోరీకి గురైన ద్విచక్ర వాహనాల ఆచూకీ దొరికినట్లు ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన శ్రీనివాసులు, దేవళంవీధికి చెందిన షేక్ ఆయిషాలకు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు ద్విచక్ర వాహనాలు పుంగనూరు పోలీసులకు పట్టుబడినట్లు సీఐ తెలిపారు.

దంపతులను ఢీకొన్న ట్రాక్టర్

భర్త మృతి... భార్యకు తీవ్ర గాయాలు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: ట్రాక్టర్ ఢీ కొనడంతో భార్యకు గాయాలవగా భర్త మృతి చెందిన ఘటన బుధవారం పీలేరు మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్‌కు చెందిన శివకుమార్ (30), నీలావతి దంపతులు ద్విచక్ర వాహనంపై పీలేరుకు వస్తుండగా ముడుపులవేముల పెట్రోలు బంకు వద్ద పీలేరు వైపు నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమార్ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీలేరు పోలీసులు తెలిపారు.


శివకుమార్ (పాత చిత్రం)

బీసీ గర్జనకు చలో దిల్లీ 5న

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న చలో దిల్లీ బీసీ గర్జనను విజయవంతం చేయాలని జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.రమణ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరగా బీసీ కులగణనను నిర్వహించాలని, బీసీలకు రాజకీయపరంగా 50 శాతం అన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్ కల్పించాలని ఈ చలో దిల్లీ బీసీ గర్జన నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని, చట్టసభల్లో ప్రాముఖ్యత కలిగించేలా చూడాలని కోరారు. మదనపల్లెలో కూడా తెదేపా గెలుపునకు బీసీలు వెన్నెముకగా నిలిచారన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ దహనం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సహజీవన్‌బాబు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు విజయ్‌మోహన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, సుబ్బరాయుడుతో పాటు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచేందుకే చెకుముకి పోటీలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు జన విజ్ఞాన వేదిక (జేవీవీ) చెకుముకి పరీక్ష నిర్వహిస్తోందని ఆ సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడు హరీంద్రనాథ్‌శర్మ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రజల్లో మూఢ విశ్వాసాలను పోగొట్టేందుకు జవివే కృషి చేస్తుందన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ఉపాధ్యక్షుడు జయచంద్ర, కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, వెంకట రమణ, సైన్స్ ఫోరమ్ నాయకులు భాస్కరన్, శాస్త్రి, గాలి రవీంద్ర, పుణ్యవతి, శ్రీనివాసులురెడ్డి, వరప్రసాద్, విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలీ ధరలు పెంచాలని దీక్ష

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పౌర సరఫరాల సంస్థ గిడ్డంగిలో పనిచేస్తున్న హమాలీలకు కూలీ ధరలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, పట్టణ కార్యదర్శి తిరుమల డిమాండ్ చేశారు. బుధవారం నీరుగట్టువారిపల్లెలోని పౌరసరఫరాలశాఖ గిడ్డంగి ఎదుట పౌరసరఫరాలశాఖ హమాలీ కార్మికుల సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు కళ్లకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగిన నేపథ్యంలో హమాలీలకు ఇచ్చే కూలి ధరలను పెంచాలని, కొత్త ధరలను అమలు చేయాల్సిన పౌరసరఫరాలశాఖ తొమ్మిది నెలలు కావస్తున్న జీవో విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ప్రతి నెలా వేతనాలు ఇవ్వడంలో అలసత్వం చేస్తున్నారని, రూట్ ఆప్టిమేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, అయూబ్, విజయ్‌కుమార్, వీరాంజనేయులు, మహమ్మద్ రఫీ, మస్తాన్, ముబారక్, జగదీష్, నదీమ్, దిలీప్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు, నాయకులు

14 మంది గంజాయి విక్రేతల అరెస్టు

● పరారీలో ప్రధాన నిందితుడు

● ముగ్గురు బాల నేరస్థుల గుర్తింపు

● డీ-అడిక్షన్ కేంద్రానికి తరలింపు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : గంజాయి వినియోగించడంతో పాటు విక్రయాలు చేస్తున్న 14 మందిని బుధవారం అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. బుధవారం మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విద్యారంగానికి ప్రసిద్ధి చెందిన కురబలకోట మండలం అంగళ్లులో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశానుసారం మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ రమేష్, మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ, ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌తో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కురబలకోట మండలంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలోని నాగరాళ్ల వద్ద పోలీసు జీపు వెళ్తుండగా కొంతమంది వాహనాన్ని చూసి పరారయ్యేందుకు యత్నించడంతో పోలీసు సిబ్బంది చుట్టుముట్టి పట్టుకున్నారన్నారు. వీరిలో ప్రధాన నిందితుడైన కలకడ మండలం బంగారువాండ్లపల్లెకు చెందిన పటాన్ మౌలాలి పోలీసు వాహనాన్ని చూసి పరారయ్యాడన్నారు. మిగిలిన వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద తనిఖీ చేయగా గంజాయి ఉన్న కవర్లు దొరికినట్లు తెలిపారు. వీరంతా కూడా మౌలాలి వద్ద కొనుగోలు చేసి వారు వినియోగించుకోవడంతో పాటు మదనపల్లె, అంగళ్లు ప్రాంతాల్లో చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. వీరివద్ద నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరికి విశాఖపట్నం నుంచి రైలు మార్గంలో గంజాయి సరఫరా అవుతున్నట్లు తేలిందన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతికపరంగా నిందితుడి వివరాలు సేకరించి పట్టుకునేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. త్వరలోనే అతన్ని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన రాజోళ్ల హరినాథ్ (27), నందిరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ (26), షేక్ కమాల్‌బాషా (49), మేకల ఖాదర్‌బాషా (70), షేక్ మహబూబ్‌సాబ్ (55), పటాన్ బావాజీ సుహేల్ అలియాస్ సుగల్ (40), షేక్ సయ్యద్‌బాషా (25), బి.కొత్తకోట మండలం సీతువారిపల్లెకు చెందిన మేనుపడి రమేష్ (30), నామాలపల్లెకు చెందిన గెంతోళ్ల శ్రీనాథ్ (35), మదనపల్లెలోని అప్పారావువీధికి చెందిన షేక్ సయ్యద్‌బాషా (26), యనమలవారిపల్లెకు చెందిన యర్రబల్లి రవికిరణ్ (22), ప్రశాంత్‌నగర్‌కు చెందిన గుంటిమడుగు షాకీరుల్లా (23), శివాజీనగర్‌కు చెందిన షేక్ ఫహద్ (25), వాల్మీకిపురం మండలం పత్తేపురానికి చెందిన సురేష్ (37)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఈ కేసులో మరో ముగ్గురు బాల నేరస్థులు ఉన్నారని వారిని తిరుపతిలోని డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో పాటు గంజాయి స్వాధీనం సుకునేందుకు కృషి చేసిన సీఐలు రమేష్, కళా వెంకటరమణ, ఎస్‌ఐ దిలీప్‌కుమార్, సిబ్బంది ఎస్.వి.ప్రసాద్, హరి, ఎం.సుధాకర్, శ్రీనివాసులు, జమీల్‌అహ్మద్, ప్రేమ్‌కుమార్, శాంతకుమార్, సుధాకర్ మధుకర్‌రెడ్డి, రమేష్, వెంకటరమణలను అభినందించారు. వారికి రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రెండు నెలల్లో 40 మంది గంజాయి వినియోగ, విక్రయదారులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. గంజాయి రహిత ప్రాంతంగా మదనపల్లెను తీర్చి దిద్దేందుకు ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.


నిందితులు, గంజాయిని చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐలు రమేష్, కళా వెంకటరమణ, ఎస్‌ఐ దిలీప్‌కుమార్, పోలీసులు

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

వేతనాలకు హమాలీల నిరసన


గోదాం వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: వేతనాలను పెంచాలని డిమాండు చేస్తూ బి.కొత్తకోట పౌరసరఫరాల గోదాం ఎదుట బుధవారం హమాలీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసనను తెలిపారు. పెంచిన కొత్త కూలి రేట్లను ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు కార్య రూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తంబళ్లపల్లె ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సలీంబాషా, బి.వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బాబాజాన్, గంగాధర్, బి.రాజు, వెంకట్రమణ, జబీబుల్లా, లక్ష్మన్న పాల్గొన్నారు.

మొరవ... మరమ్మతులు కనవా?


ఆనవాళ్లు కోల్పోతున్న ఉప్పినెల్లి చెరువు మొరవ

రామసముద్రం మండలం ఉప్పినెల్లి చెరువు మొరవ దుస్థితికి చేరుకుంది. మొరవ పాడవడంతో పాటూ ఓ వైపు తెగిపోయి ఉంది. చెరువుకు నీరు చేరితే వృథా అయ్యే పరిస్థితి ఉంది. మొరవకు మరమ్మతులు చేసి బాగు చేయాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు. ఈ విషయంపై జలవనరులశాఖ ఏఈ శ్రీధర్‌ను వివరణ కోరగా పరిస్థితిని చూసి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

పీలేరు: ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్ల నుంచి వృథా నీరు రోడ్డుపైకి వచ్చి కంపు కొడుతోందని 'మేమున్నాం మీకుతోడుగా'లో భాగంగా ఈనాడులో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ నెల 23న కథనం ప్రచురితం కాగా స్పందించిన డీఎం బండ్ల కుమార్, ఇంజినీర్ మునిరాజ బుధవారం మురుగునీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా గొట్టాలు ఏర్పాటు చేయించారు.

మదనపల్లె వైద్యం: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఎలుకలు పెరిగిపోయి కాలువల్లోకి మట్టి తోడేస్తుండటంతో మురుగు నిలిచిపోయి ఇబ్బందికరంగా మారిందని ఫిర్యాదు రావడంతో మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా సమస్య 'ఈనాడు'లో ఈ నెల 7వ తేదీన ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు పెస్ట్ కంట్రోల్ విభాగం సిబ్బందితో మాట్లాడి ఎలుకల నివారణకు మందులు వేయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

?: కలికిరి మండలం పత్తేగడ పంచాయతీ కొటాలలో వీధుల్లో రేయింబవళ్లు వీధి దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు? **- రెడ్డిబాషా, స్థానికుడు**
✓: పగటి పూట వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. - హిమబిందు, కార్యదర్శి, **- న్యూస్‌టుడే, కలికిరి**

?: గుర్రంకొండ కొత్తపేట పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో చెత్త కుప్ప వేశారు? తొలిగించండి? **- రహంతుల్లాసాహెబ్**
✓: పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న చెత్త కుప్ప మా దృష్టికి రాలేదు. నేడే ఆ చెత్త కుప్పను తొలిగించి శుభ్రం చేయిస్తాను. **- విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి, గుర్రంకొండ, - న్యూస్‌టుడే, గుర్రంకొండ**

?: కలకడలోని దిగువవీధిలో కాలువల్లో చెత్తచెదారం చేరి మురుగు నిల్వ ఉంటోంది. దుర్వాసనతో పాటు దోమలు అధికమవుతున్నాయి? పంచాయతీ అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయాలి? **- సయ్యద్‌బాషా, కలకడ**
✓: కాలువలో ఉన్న చెత్తచెదారం తొలగించి శుభ్రం చేసి, దోమల నివారణ చర్యలు చేపడతాం.
- దేవేంద్ర, కార్యదర్శి కలకడ - న్యూస్‌టుడే, కలకడ

సంచార సేవలు... అరకొర మందులు

పాడి రైతులకు దక్కని భరోసా

గ్రామాల్లో ఉత్తుత్తి పశువైద్య శిబిరాలు


పీటీఎం మండలం కొత్తపల్లిలో ఆగిన వాహనం

ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: జిల్లాలో సంచార పశు వైద్య సేవలందించే వాహన సేవలు మచ్చుకైనా కన్పించడం లేదు. గ్రామీణ పశువైద్యశాలలు, డిస్పెన్సరీల్లో అందే వైద్య సేవలను రద్దు చేసి గత వైకాపా ప్రభుత్వం ఈ వాహన సేవలను ప్రారంభించింది. అయితే ఈ వాహనాల సంచారం కన్పించకపోగా వచ్చిన చోట మందుల్లేవని చేతులెత్తేస్తున్నారు. దీంతో పశు పోషకులు మందులు కొనాల్సి వస్తోంది.

● జిల్లాలో మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలకు 13 సంచార వాహనాలను కేటాయించారు. ఈ వాహనాల్లో పశువులకు అత్యవసర సేవలు అందించడానికి ఓ పశువైద్యాధికారితో పాటు సహాయకుడిని గత వైకాపా ప్రభుత్వం నియమించింది. అయితే గత ప్రభుత్వంలో పేరుకు గొప్ప అన్నట్లుగా సేవలు అమలు చేసి తరువాత మందుల కొరత ఏర్పడడంతో పాటు అరకొర మందులు సరఫరా చేశారు. ఇప్పటి వరకు మందులు సరఫరా చేసే గుత్తేదారుకి రూ.120 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సంచార పశు ఆరోగ్య సేవల వాహనాల్లో కొరత ఉన్న మందులను అరకొరగా పశువైద్యశాలల నుంచి తీసుకొని గ్రామాల్లో సేవలు అందిస్తున్నారు.

వాహనం ఉంది... మందుల్లేవు



మాది పీటీఎం మండలం, కొత్తపల్లి. మా పాడి ఆవు వారం రోజులుగా నెమరు వేయడం లేదు. సంచార పశు ఆరోగ్య సేవ వాహనానికి సమాచారం అందించా. వాహనం గ్రామానికి వచ్చినా పాడిపశువును పరీక్షించిన సిబ్బంది మందులు లేవంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. వైద్యసేవ వాహనాలు ఆపదలో ఉన్న పశువులను ఆదుకుంటాయనుకుంటే మందులు లేవనడం బాధాకరం. **- మధుసూదన్‌రెడ్డి, పాడి రైతు**

ప్రతిపాదనలు పంపించాం

వైద్య సేవ వాహనదారులు ఇండెంట్ పంపిన నాలుగు రోజుల్లోనే మందులు సరఫరా చేస్తున్నాం. సంచార వాహనంలో 100 రకాల మందులు సరఫరా చేసి సేవలు అందిస్తున్నాం. వాహనంలో మందులు కొన్ని రకాల జబ్బులకు మాత్రమే ఉంటాయి. పశువైద్యశాలలో మందులతో పాటు వాహనంలో ఉన్న మందులు కూడా ఉపయోగించి సేవలు అందిస్తున్నాం. **- నరేష్, సంచార పశుఆరోగ్య సేవ వాహనం, జిల్లా మేనేజర్**

రహదారిపైకి మురుగు పరుగు


కాలువ లేక రహదారిపైకి చేరుతున్న మురుగు

మదనపల్లె - చెంబుకూరు రహదారిపై మురుగు ప్రవహిస్తుంది. ఈశ్వరమ్మకాలనీ పంచాయతీ పరిధిలోని రెహ్మత్‌నగర్‌లో మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగు రోడ్డుపైకి వస్తోంది. వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు దెబ్బతింది. వర్షాలు కురిస్తే ఈ ప్రాంతం బురదమయంగా మారుతోంది. దీంతో పాటు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలికంగా పనులు చేపట్టి వదిలేశారు. దీంతో ద్విచక్రవాహనదారులు రాత్రివేళల్లో అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలికంగా మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించకుండా చర్యలు తీసుకుంటామని, కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరైన వెంటనే సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవో భానుప్రసాద్ పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

దళితులకు న్యాయం చేయాలి

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : ఇళ్ల నిర్మాణాల కూల్చివేతకు గురైన బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లెకు సమీపంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. తొలగించిన నిర్మాణాలను పరిశీలించి, అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని దళితులు ఇబ్బందులు పడి పునాదులు నిర్మించుకున్నారని, వారిప్పుడు పూర్తిగా నష్టపోయారని అన్నారు. ఇళ్ల నిర్మించే సమయంలో రెవెన్యూ అధికారులు మౌనంగా ఉండి, ఇప్పుడు కూల్చి వేయడం అన్యాయమని తెలిపారు.

అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో మదనపల్లెలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ఛైర్మన్ అమృత ప్రసాద్, డైరెక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపల్ షహనాజ్ తెలిపారు. కర్నూలులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 23న జరిగిన పోటీలకు పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో 15 మంది బంగారు పతకాలు, 10 మంది రజతం, 11 మంది కాంస్య పతకాలు సాధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కరాటే మాస్టర్ సదాశివను అభినందించారు.



ప్రతిభ చూపిన మదనపల్లె ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో నిర్వాహకులు

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

మదనపల్లె పట్టణం: జనసంఘ్ పార్టీ సిద్ధాంతకర్త పండింట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ కాలనీ పార్టీ భాజపా కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్ మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్, జనసంఘ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ఆ మార్గంలో పయనించడానికి అందరం ప్రయత్నిద్దామని తెలిపారు. నాయకులు ఆకుల కృష్ణమూర్తి, కోసూరి భవానీ, పూల నాగరాజు, భువనేశ్వర్ సత్య, వెంకటేశ్వరరావు, కొండయ్య, సంతోష్, గణపతి, వెంకటేష్, శ్రీకాంత్, గోకుల్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణే ఐసీడీఎస్ ధ్యేయం


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో రాజమ్మ, సిబ్బంది

కోటపల్లె (పీలేరు గ్రామీణ), న్యూస్‌టుడే: తల్లీ బిడ్డలకు రక్తహీనత, పోషకాహార లోపాన్ని అరికట్టాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుపరిచే పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ పిలుపునిచ్చారు. బుధవారం పీలేరు మండలం కోటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. చౌకగా లభించే ఆకుకూరలు ఆహారంగా తీసుకుంటే పోషకాహార లోపం పోతుందని, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని ఆమె తెలిపారు. పిలలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి చదివించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా గర్భిణిలకు సీమంతాలు నిర్వహించారు. పర్యవేక్షకురాలు అక్కాయమ్మ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతిలత, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం: తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మదనపల్లె సీడీపీవో సుజాత అన్నారు. మండలంలోని కాప్పల్లె, ఆర్.నడింపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం 'పౌష్టిక ఆహార మాసోత్సవాలు' నిర్వహించారు. కేంద్రాల్లో గర్భవతులకు సీమంతాలు చేపట్టారు. గర్భవతులు, బాలింతలు, కిశోర్‌బాలికల్లో రక్తహీనత నివారణకు తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. ఆర్.నడింపల్లెలో జరిగే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిశీలించారు. తల్లీబిడ్డల క్షేమం కోసం ఐసీడీఎస్ ప్రాజెక్టు కృతనిశ్చయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు చంద్రకాంత, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సాధారణ సమావేశం

మదనపల్లె పట్టణం : పురపాలక సంఘం సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ మనూజ ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమౌతుందని కౌన్సిలర్లు, అధికారులు హాజరై పట్టణాభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వార్డు బాట

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే వార్డు పర్యటన చేస్తున్నామని ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరీ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

చిన్న వాహనాల సంఘం కార్యవర్గం ఎన్నిక

బి.కొత్తకోట: ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న చిన్నతరహా మోటారు వాహన కార్మికుల సంక్షేమ సంఘం బి.కొత్తకోట మండల అధ్యక్షుడిగా కె.సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అరుణ్ షరీఫ్, సహాయ కార్యదర్శులుగా పి.లక్ష్మణ్‌రెడ్డి, జి.నాగరాజు, కోశాధికారిగా పి.రమణ, సలహాదారులుగా ఎం.వెంకట కృష్ణయ్య, కె.బలరాంరెడ్డి, మధుభూషణ్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి మనోహర్‌రెడ్డి బుధవారం ప్రకటించారు.

ఆటో బోల్తా... అయిదుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటో బోల్తా పడి అయిదుగురు గాయపడిన ఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. మదనపల్లె పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన రెహానా (50), సోని (23), వరలక్ష్మీ (24), రూప (27) సొంతపనిపై కర్ణాటకకు వెళ్లారు. పనిముగించుకుని తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో మదనపల్లె మండలం బెంగళూరు రోడ్డులోని బార్లపల్లె వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు మహిళలతో పాటు ఆటో నడుపుతున్న శివాజీనగర్‌కు చెందిన మహేష్ (32) గాయపడ్డాడు. వీరిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

11 మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు, మదనపల్లె : ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ పూర్వ సీఈవోగా గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. 65మండలాలకు గాను 18 మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా ఇన్‌ఛార్జిల పాలన నడుస్తోంది. మదనపల్లె డివిజన్‌లో 11 మంది ఎంపీడీవోలను బదిలీ చేసినట్లు ఆమె ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో పనిచేసే ఎంపీడీవోలు బదిలీకి దరఖాస్తు చేసుకోకపోవడంతో వారు అక్కడే కొనసాగనున్నారు.

ఎంపీడీవో పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
గంగయ్య	కలికిరి	కురబలకోట
తాజ్‌మసూర్	గుడుపలె	మదనపల్లె
అబ్దుల్‌రహీం	పెద్దపంజాణి	కలకడ
భానుమూర్తిరావు	వడమాలపేట	కలికిరి
సుధాకర్	చౌడేపల్లె	కేవీపల్లె
హరినారాయణ	కురబలకోట	ములకలచెరువు
భానుప్రసాద్	మదనపల్లె	రామసముద్రం
పరమేశ్వరరెడ్డి	కలకడ	నిమ్మనపల్లె
ఉపేంద్రరెడ్డి	పీలేరు	తంబళ్లపల్లె
శివశంకర్	బంగారుపాళ్యం	పీలేరు
విష్ణుచిరంజీవి	రేణిగుంట	పీటీఎం

వైకాపా పాపాల ప్రక్షాళనే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన నాయకులు

రామసముద్రం, న్యూస్‌టుడే: వైకాపా పాపాల ప్రక్షాళనే డమే లక్ష్యంగా తెదేపా, భాజపా, జనసేన కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లెలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సమస్యలను చెప్పుకోవడానికి ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు వెళ్లితే బాధితులకు కనీస మర్యాద కూడా దక్కేవికాదని గుర్తు చేశారు. ప్రజలే దేవుళ్ల ప్రజాశ్రేయస్సే ఆశయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సూచించారు. విజయవాడలో వరద బీభత్సంతో జనం విలవిల్లాడితే రాత్రింబవళ్లు తేడా లేకుండా సీఎం పనిచేశారని గుర్తు చేశారు. రామసముద్రం మండలంలో రూ.3 కోట్లుతో సీసీరోడ్లు, రూ.2 కోట్లుతో వాలీశ్వర స్వామి ఆలయ రహదారి, రూ.70 లక్షలతో గట్టు వేంకటేశ్వరస్వామి ఆలయ రహదారిని నిర్మిస్తున్నట్లు వివరించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల సంక్షేమానికి దేశంలోనే ఎక్కడాలేని విధంగా పించను మొత్తాన్ని రెట్టింపు చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదగా రైతులకు ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీఎం సుబ్రహ్మణ్యం, మదనపల్లె టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మెన్ విద్యాసాగర్‌నాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, తెదేపా సీనియర్ నాయకులు రాటకొండ మధుబాబు, కృష్ణమరాజు యాదవ్, శివశంకర్, తిప్పన్న, రఘునాథరెడ్డి, ఎల్.శివ, శివకుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సీతారామయ్య, పెద్దిరెడ్డి, రూపేష్‌రెడ్డి, అల్తాఫ్‌బాషా, చిన్నస్వామినాయుడు, చలపతినాయుడు, వెంకటరమణనాయుడు, బందలిశివ, చిన్నూస్వామి, ప్రశాంత్‌రెడ్డి, కృష్ణప్ప, బాలాజీ, వేణుగోపాల్ జనసేన నాయకులు రామాంజనేయులు, అనిత, భాజపా నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాస్‌మోదీ, ఆనందకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి, పక్కన తెదేపా నాయకులు, అధికారులు

పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు

సర్కారుతోపు (కురబలకోట) : తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తంబళ్లపల్లె నియోజకవర్గ తెదేపా నేత జయచంద్రారెడ్డి వెల్లడించారు. నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ కేంద్రంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గుడే శ్రీనివాసులుతో కలసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో డిగ్రీ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యాసంస్థలు లేవని, అందువల్ల కనీసం మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకైనా చర్యలు తీసుకోవాలని జనసేన నేత హేమంత్‌కుమార్ కోరగా, ఈ అంశాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెడతామని తెలిపారు. తొలుత సభలో పలువురు మహిళలు సమస్యలను వివరించారు. తెదేపా నాయకులు కామకోటి ప్రసాదరావు, మల్లికార్జుననాయుడు, పి.సురేంద్ర యాదవ్, త్యాగరాజు, వైజీ సూరి, అయూబ్, మాజీ మండలాధ్యక్షుడు గుడే శ్రీనివాసులు, జంగా రాఘవరెడ్డి, రుద్ర బాలకృష్ణ, తహసీల్దారు తపస్విని, హరి నారాయణ, జనసేన నాయకులు ప్రసంగించగా, తెదేపా నాయకులు శ్రీనాథరెడ్డి, తులసీధర్ నాయుడు, భాజపా నాయకులు రాజారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం... జ్వరాల బారిన జనం

కంభంవారిపల్లి, కలకడ, వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వర్షాల రాకతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది... దీంతో జనం జ్వరాన బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో మురుగు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపడం లేదు. గ్రామాల్లో నీటి కుళాయిలు, చేతి బోర్ల వద్ద నీరు నిల్వ ఉండి మురుగుగా మారుతోంది. ఈ కారణంగా అక్కడ దోమలు వృద్ధి చెంది, జ్వరాలు ప్రబలుతున్నాయి. కాలువలు లేకపోవడంతో మురుగు వీధుల్లో ప్రవహిస్తుంది. వర్షం కురిసిన సమయంలో వర్షపు నీరు మురుగు కలసి ప్రవహించడం వల్ల పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. ఇటీవల జరిగిన కంభంవారిపల్లె మండల సర్వసభ్య సమావేశంలో పారిశుద్ధ్యంపై వైద్యులు, పంచాయతీ కార్యదర్శుల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశంలో జిల్లేళ్లమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించిందని అన్నారు. పారిశుద్ధ్యం లోపించడం వల్లనే రోగాలు ప్రబలుతున్నాయని వైద్య సిబ్బంది అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


కలకడలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పంచాయతీ కార్యదర్శులు స్పందిస్తున్నారు.
- గఫూర్, ఈవోపీఆర్డీ, కంభంవారిపల్లె

మండలాల్లో ఇదీ పరిస్థితి

● కంభంవారిపల్లె మండలం గర్నిమిట్ట, జిల్లేళ్లమంద, నూతన కాలవ గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గర్నిమిట్ట బస్టాండుకు సమీపంలో కోళ్ల వ్యర్థాలు వేయడంతో పారిశుద్ధ్యం లోపించింది.

● కలకడ మండలంలోని గుర్రంకొండ రోడ్డులో మురుగు కాలువలు లేక మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. చెరువుబండవీధి, పోస్టాఫీసు వీధుల్లో, మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● గుర్రంకొండ మేజరు పంచాయతీలో గంజికాలువ, ఎంపీడీవో కార్యాలయ వీధి, ఎస్సీ వసతి గృహం పక్కన, బలిజగడ్డ, ఇందిరమ్మ కాలనీ, తాళెంవీధి, బలిజగడ్డ, పోలేరమ్మ గుడి వీధుల్లో మురుగు ఎక్కువగా ఉండటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది.

● పీలేరు పట్టణంలో బస్టాండు పరిసర ప్రాంతాల్లో మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడం, శుభ్రం చేయకపోవడంతో మురుగు నిల్వ ఉండి, పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.

● కలికిరి బస్టాండు, ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో మురుగు ఉండటం వల్ల పారిశుద్ధ్యం లోపించింది.

● వాల్మీకిపురం పట్టణంలో నాయక్ వీధి, అగ్ని బాధిత కాలనీ, ఎల్ఆర్ వీధులలో పారిశుద్ధ్యం లోపించింది.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

రామాపురం: గువ్వలచెరువు పంచాయతీ పరిధిలోని సూర్య కనుమలపై వెలసిన శ్రీతిరువెంగళనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు. ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విజయనగరరాజులు, శ్రీకృష్ణదేవరాయలు కాలం నాటిదని శాసనాల ద్వారా తెలుస్తుందన్నారు. ఆలయ ప్రాగణం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండడంతో అటవీ శాఖ అధికారులతో సంప్రదించి వారి అనుమతులతో ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తామన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

సుండుపల్లి: హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో బుధవారం మీకు తెలుసా అనే నినాదంతో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఛైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, సుండుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. డీఆర్పీ అల్లావల్లి మాట్లాడుతూ.. ఎయిడ్స్‌కు నివారణే మార్గమన్నారు.

ఘనంగా ఫార్మసిస్టుల దినోత్సవం

రాజంపేట: నేటి సమాజంలో ఫార్మసిస్టుల ఆవశ్యకత ఎంతైనా ఉందని.. వారి సేవలు ఎనలేనివని ఏఐటీఎస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ రోగ నిర్ధారణ, ఔషధాల వినియోగం, దుష్ఫలితాలపై ఫార్మశిస్టులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. పి.ద్వారకానాథ్‌రెడ్డి, వి.చిన్నకృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

రాయచోటి గ్రామీణ: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

?: గాలివీడు బస్టాండ్ ప్రధాన రహదారిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. పిల్లలు, వృద్ధులు ఒంటరిగా నడిచి పోవాలంటే భయాందోళన చెందుతున్నారు. **- కొంగా రాము, స్థానికుడు**

✔: ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
- సురేష్‌కుమార్, గాలివీడు పంచాయతీ కార్యదర్శి

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం... రోగాల భయం

● అధ్వానంగా మురుగు నీటి పారుదల వ్యవస్థ ● అవస్థలు పడుతున్న జిల్లా కేంద్రం ప్రజలు

– న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

జిల్లా కేంద్రం రాయచోటిలో మురుగు నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చాలా ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఉన్న వాటిలో నెలల తరబడి పూడిక తీయడం లేదు. దీంతో వీధుల్లో రహదారులపై మురుగు ప్రవహిస్తోంది. దోమల బెడద తీవ్రమవుతోంది. వ్యాధులు ప్రబలుతున్నాయని పుర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పురపాలక పరిధిలో సుమారు 31 వేల నివాసాలు ఉన్నాయి. లక్ష 20 వేల మంది జనాభా ఉన్నారు. పురపాలక పరిధిలో ఇప్పటి వరకు సుమారు 197 కి.మీ. మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. ఇంకా 26 కి.మీ మేర కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.


మురుగు నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో బురదమయంగా మారిన మార్కెట్ ప్రాంతం

● పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ, కొత్తపేట, బోస్‌నగర్, కొత్తపల్లె, మహమ్మదీపుర వీధి, మహబూబ్‌నగర్ వీధి, కె.రామాపురం, మార్కెట్ వీధి ఇలా చాలా చోట్ల మురుగు కాలువలను సమయానికి శుభ్రం చేయడం లేదు. రోడ్డుపై మురుగు పారుతూ నిల్వ ఉంటోంది. మదనపల్లె రోడ్డు, చిత్తూరు రోడ్డు ప్రధాన రహదారుల వెంబడి చాలా చోట్ల మురుగు కాలువలు దెబ్బతిన్నాయి. వర్షం పడినపుడు ఈ కాలువలు పొంగి ప్రవహిస్తుంటాయి. అలాంటప్పుడు కాలువలపై నిర్మాణం దెబ్బతిన్న చోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేపట్టి, కాలువలు లేని ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.

అసంపూర్తిగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ

జిల్లా కేంద్రమైన రాయచోటిలో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ. 234 కోట్ల అంచనా వ్యయంతో 2019లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు పురపాలకలోని శివారు ప్రాంతాల్లో కొంత మేర పనులు చేసి నిలిపేశారు. పనులు నాణ్యతగా చేపట్టలేదు. దీంతో ఇప్పటికే చాలా చోట్ల అవి దెబ్బతిన్నాయి. దీంతో పురపాలకలో మురుగు నీటి వ్యవస్థ అధ్వానంగా తయారైంది.

కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి



పురపాలక పరిధిలో మురుగు కాలువలను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. వర్షాలు పడినప్పుడు కాలువలు పొంగిపొర్లుతూ.. మురుగు రోడ్లపై ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటోంది. దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలుతున్నాయి. తరచూ అనారోగ్యం పాలవుతున్నాం. అధికారులు స్పందించి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి. **- ఆర్.చెన్నకృష్ణ, రాయచోటి**

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

పట్టణంలో మురుగు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుస్తాం. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. దెబ్బతిన్న మురుగు కాలువల మరమ్మతులు చేయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. పురపాలక పరిధిలో మిగిలిన మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. **- వాసుబాబు, కమిషనర్, పురపాలక సంఘం, రాయచోటి**

విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలి


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి

పుల్లంపేట, న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలని రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి తెలిపారు. పుల్లంపేట కస్తూర్బా పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని సిబ్బందికి సూచించార. క్రీడా ప్రాంగణంలో వసతులు కల్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థినులు ఇష్టపడి చదివి పరీక్షలు రాయాలన్నారు. ఆమె వెంట ఎంఈవో-2 నాగతిరుమలరావు, కస్తూర్బా సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్సుల రూట్ మార్పు

రాజంపేట, న్యూస్‌టుడే: పోలీసుల సూచన మేరకు రాజంపేట ఆర్టీసీ డిపో నుంచి పాతబస్టాండ్ వైపు వెళ్లే బస్సులు పట్టణంలో నుంచి కాకుండా బైపాస్ నుంచి పాతబస్టాండుకు చేరుకుంటాయని డిపో మేనేజర్ రమణయ్య తెలిపారు. పాత బస్టాండు నుంచి కడప వైపు వెళ్లే బస్సులు మాత్రం యథాతథంగా పట్టణంలో నుంచే వెళ్తాయని వివరించారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

వృత్తి విద్యలకు ప్రాధాన్యం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: చదువుతో పాటు విద్యార్థులు వృత్తి విద్యలపై పట్టు సాధించాలని ఓబులవారిపల్లె కస్తూర్బా పాఠశాల అధ్యాపకురాలు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. వృత్తి విద్య సందర్శన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె పట్టణంలోని గ్లోబల్ సర్వీసు ట్రస్టు కార్యాలయాన్ని విద్యార్థినులకు చూపించారు. ట్రస్టు అధ్యక్షుడు పార్థసారథి ఆధ్వర్యంలో విద్యార్థినులకు టైలరింగ్ పనులపై అవగాహన కల్పించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నందలూరు, న్యూస్‌టుడే: ఈ నెల 24న కడప మున్సిపల్ స్టేడియంలో జరిగిన అండర్-17, అండర్-14 విభాగాలలో జరిగిన అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలలో లేబాక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శివరాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు జగదీష్ శుభాంకర్, శివ చైతన్య, శశికిరణ్‌లను వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిత్ దీన్‌దయాళ్


దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాయిలోకేశ్ తదితరులు

రాజంపేట, నందలూరు, న్యూస్‌టుడే: ఏకాత్మ మానవత వాద సిద్ధాంతకర్త, భాజపా వ్యవస్థాపకులు, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో బుధవారం పండిత్ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు మరో కార్యక్రమంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. నందలూరు మండల భాజాపా నాయకుల ఆధ్వర్యంలో కూటమి నాయకులు దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. భాజాపా, తెదేపా నాయకులు పోతురాజు మస్తానయ్య, జంబు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు : మంత్రి


ప్రజల సమస్యలు వింటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బోడిరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో పేదల భూములను కొందరు వైకాపా నేతలు ఆక్రమించుకున్నారని.. వాటిని తిరిగి పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు


ప్రజలకు కరపత్రాన్ని అందజేస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందజేస్తున్నట్లు తెదేపా రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఒంటిమిట్టలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను ఇంటింటికెళ్లి ప్రజలకు పంపిణీ చేశారు. గత వైకాపా పాలనలో అక్రమ సంపాదనే ధ్యేయంగా ఆ పార్టీ నాయకులు పనిచేశారని మండిపడ్డారు. నాయకులు వెంకటనరసయ్య, బి.రామదాసు, ఎం.ఈశ్వరయ్య, కె.హరినాథ్‌రెడ్డి, ఎం.నరసింహులు, కె.శివారెడ్డి, బాలమునెయ్య, చౌడయ్య పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులకు శిక్షణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు

రాయచోటి గ్రామీణ, (సంబేపల్లె), న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులకు, యూనిట్ లీడర్లకు ఆపదమిత్ర కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపదమిత్ర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 30వతేదీలోపు గూగుల్ ఫామ్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీనెయ్యి వినియోగం నేరం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు నెయ్యి కలిపి వినియోగించడం నేరమని కూటమి నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు భక్తిభావంతో తీసుకునే లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించిన.. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పోలినేని శివయ్యనాయుడు, నాగేంద్ర, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి-రాయచోటి మార్గం అనుంపల్లి అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు ఉద్యోగులు గాయపడ్డారు. సుండుపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రాజశేఖరరెడ్డి, టైపిస్టు కిషోర్‌లు ఓ ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళుతుండగా రాయచోటి వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహన చోదకుడు వీరి వాహనాన్ని ఢీకొట్టారు. ముగ్గురు గాయపడగా వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజలకు ఉత్తమ పరిపాలన అందిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు, న్యూస్‌టుడే: అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. పెనగలూరు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానంద రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకుడు తాతంశెట్టి నాగేంద్రలతో కలిసి బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలపై వినతులు వస్తున్నాయన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో పెత్తందారి పాలన నుంచి పెనగలూరుకు విముక్తి కలిగిందన్నారు. దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, ఎంపీడీవో వరప్రసాద్, తెదేపా నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి, నాగేశ్వర నాయుడు, బాబునాయుడు, దామోదర్, శ్రీనివాసులురెడ్డి, యానాదయ్య, ఆనందనాయుడు పాల్గొన్నారు.

సనాతనధర్మం, ఆధ్యాత్మికతపై అవగాహన సదస్సు 28న

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని దేవాలయాల పాలకవర్గ ఛైర్మన్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, దేవాలయ ఉద్యోగులు, పూజారులకు ఈ నెల 28న ఉదయం పది గంటలకు రాయచోటిలోని శ్రీవీరభద్రస్వామి దేవస్థానం నందు ఆధ్యాత్మిక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భారతీయ సనాతన ధర్మం, దేవాలయాల పురోగతి, పరిరక్షణ బాధ్యతలు, భారతీయ సంస్కృతి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

వీరబల్లి: సోమవరం గ్రామం కమ్మపల్లెలో నెలకొన్న వివాదాస్పద ఇంటి స్థలాల విషయమై తహసీల్దారు శ్రావణి, ఎస్సై మోహన్‌నాయక్‌లు బుధవారం విచారణ చేపట్టారు. ధ్రువపత్రాల ఆధారంగా స్థలాన్ని గుర్తిస్తామన్నారు. ఓ వర్గం వారు నిర్మాణాలు చేపట్టడంతో మరో వర్గం వారు వాటి పరిస్థితి ఏంటని అధికారులను ప్రశ్నించగా.. సమస్యను పరిష్కరించకుండానే వెళ్లిపోయారు. రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతను జోడిస్తే సత్ఫలితాలు

రామాపురం: సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేరుసెనగకు విత్తన శుద్ధి చేయించడంతో నేల నుంచి సంక్రమించే తెగుళ్లు నివారించవచ్చన్నారు. ఓబులవారిపల్లె, సాగులో సాంకేతికత జోడించి నూతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో మల్లిక పేర్కొన్నారు. వైకోట, బాలిరెడ్డిపల్లె పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. అరటి, బొప్పాయి, పసుపు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, పశువైద్యాధికారి దుర్గా, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు



చిన్నమండెం, న్యూస్‌టుడే: బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళుతున్నానని మూడు నెలల కిందట చెప్పి వెళ్లిన తన భర్త **తలారి వెంకటేష్(32)** ఇప్పటి వరకు ఇంటికి రాలేదని కలిబండ దళితవాడకు చెందిన నాగేశ్వరమ్మ చిన్నమండెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులను గాలించినా ఫలితం పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని బాధితురాలు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కూలి పెంచాలని హమాలీల నిరసన


రాజంపేట గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

రాజంపేట, న్యూస్‌టుడే: ఈ ఏడాది జనవరి నుంచి పెంచాల్సిన హమాలీల కూలిని సివిల్ సప్లై అధికారులు పెంచకపోవడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్ వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఒప్పందం మేరకు జనవరి నుంచే కూలీల ధరలు పెరగాల్సి ఉందని.. కానీ అధికారుల నిర్లక్ష్యంతో నేటి వరకు పెరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అరియర్స్‌తో పాటు కొత్త నిబంధనల మేరకు కూలి చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాఘవేంద్ర, సూర్య, ప్రసాద్, వెంకటేష్, కోదండరాముడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పౌరసరఫరాల హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

రాయచోటి గ్రామీణ: సివిల్ సప్లై విభాగంలో పని చేస్తున్న హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య డిమాండు చేశారు. స్థానిక సివిల్ సప్లై గోదాము వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం హమాలీలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ... హమాలీలకు ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు సంపత్ కుమార్, రాంప్రసాద్, చిన్నప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ఈ నెల 22వ తేదీ నెల్లూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో చిన్నఓరంపాడు ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కడప జిల్లా జట్టు తరపున తమ పాఠశాల విద్యార్థినులు నాగేశ్వరి, భాను పాల్గొని అనంతపురం, సత్యసాయి, తిరుపతి, నెల్లూరు జిల్లాల జట్లను ఓడించి ప్రథమ స్థానం సొంతం చేసుకున్నారన్నారు. అక్టోబర్ నెలలో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

భూమి ఆక్రమించారని ఫిర్యాదు

వీరబల్లి, న్యూస్‌టుడే : తమ భూమి ఆక్రమణకు గురైందని విచారించి న్యాయం చేయాలని సానిపాయి గ్రామం కొమ్ము హరిజనవాడ గ్రామస్థులు వీరబల్లి తహసీల్దారు శ్రావణికి బుధవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా 10 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని ప్రస్తుతం కొందరు ఆక్రమణకు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు.

మేడా సోదరులపై సుగవాసి ఆరోపణలు

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని నూకినేనిపల్లిలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెదేపా నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కూటమికి అంతర్గతంగా మద్దతిచ్చారన్నారు. ఆయన సోదరుడు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డితో కలిసి తమ పార్టీతో పాటు కార్యకర్తలను మోసం చేశారని విమర్శించారు. తెదేపా కోసం పని చేస్తున్నట్లుగా వేరొకరి ద్వారా నమ్మించి ద్రోహం చేశారని ఆరోపించారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ హేమసుందర్‌రావు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని చిట్వేలి రోడ్డు హైలెవల్ వంతెన వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని సీఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. రాజంపేట మండలం మన్నూరుకు చెందిన పిండిపోయిన కార్తిక్, రైల్వేకోడూరు రంగనాయకులపేటకు చెందిన షేక్ మస్తాన్‌లు గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు వివరించారు. వారి నుంచి మూడు కిలోల గంజాయి.. రూ.2 వేల నగదుతో పాటు రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పంచాయతీలకు మహర్దశ

● 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ● రైల్వేకోడూరుకు రూ.1.68 కోట్లు మంజూరు ● తాగునీరు, రహదారులు, వీధి దీపాలకు ప్రాధాన్యం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో గ్రామీణాభివృద్ధి నీరసించింది. కనీసం తాగునీటి మోటార్ల మరమ్మతులకు సర్పంచులు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురైంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక ప్రణాళికా సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వమే దారి మళ్లించడంతో పంచాయతీల బ్యాంకు ఖాతాలు ఖాళీ అయ్యేవి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ పరిస్థితులు మారాయి. ఇటీవల 15వ ఆర్థిక ప్రణాళికా సంఘం ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయి. వీటితో తాగునీరు, రహదారులు, విద్యుత్తు నిర్వహణ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక అవసరాలు తీర్చుకోవచ్చు.

● రైల్వేకోడూరు మండలానికి రూ. 1,68,21,217 మంజూరైంది. కోడూరు గ్రామ పంచాయతీకి రూ. 60,96,559, అనంతరాజుపేటకు రూ. 11,25,515, శెట్టిగుంటకు రూ. 10,75,875, ఓబనపల్లెకు రూ. 11,28,322 కేటాయించారు. ఇలా ఆయా పంచాయతీల జనాభా ఆధారంగా నిధులను విడుదల చేశారు. త్వరలోనే మూడో విడత నిధులు విడుదల అవుతాయని ఈవోపీఆర్డీ (విస్తరణాధికారి) నాగార్జున తెలిపారు.

ఆ రెండు పంచాయతీలకు లేవు

మండల పరిధిలో మొత్తం 22 పంచాయతీలు ఉన్నాయి. అయితే రెడ్డివారిపల్లె, గుండాలపల్లె పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. అందువల్ల ఆ రెండింటికి నిధులు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. గత వైకాపా పాలన పాపమే ఇది. రెడ్డివారిపల్లె పంచాయతీలో గుండాలపల్లె ఉండేది. పెద్ద పంచాయతీ కావడం.. అక్కడి ప్రజలందరూ ఏకపక్షంగా ఓ నాయకుడికి మద్దతుగా నిలుస్తుండడాన్ని సహించలేని వైకాపా పెద్దలు రెండు పంచాయతీలుగా విడగొట్టారు. ఆ విభజన వద్దంటూ గ్రామస్థులు కోర్టును ఆశ్రయించడంతో సర్పంచి ఎన్నికలు జరగలేదు. దీంతో అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ వివాదాలతో ఆ రెండు పంచాయతీలు నిధుల లేమితో ఇబ్బందిపడుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఏకాభిప్రాయాన్ని కుదుర్చుకుని ఎన్నికలు జరుపుకోగలిగితే మిగతా పంచాయతీలతో సమానంగా అభివృద్ధి సాధించడానికి వీలవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.


పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ఓ వీధి ఇది. చిన్నపాటి వర్షానికే ఇలా నీట మునిగింది. ఆర్థిక సంఘం నిధులతో ఇలాంటి ప్రాంతాలకు రహదారి నిర్మించవచ్చు.

పారదర్శకంగా వినియోగం

గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు చేయూతగా మారుతున్నాయి. ఈ నిధుల వినియోగంలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. గతంలో మాదిరిగా చెక్కులు రాసి డబ్బులు డ్రా చేసుకోవడానికి వీలుండదు. ఈ-గ్రామస్వరాజ్ పోర్టల్ ద్వారా పటిష్ఠ విధానాలతో నిధుల వినియోగాన్ని పరిశీలిస్తాం. అన్నీ సక్రమంగా ఉంటేనే డబ్బులు విడుదల అవుతాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ నిధులు ఉపకరిస్తాయి. త్వరలోనే మరో విడత నిధులు మంజూరవుతాయి. **- నాగార్జున, ఈవోపీఆర్డీ, రైల్వేకోడూరు**

ఉపాధిహామీ పనులపై సమీక్ష

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో విజయరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. వచ్చేవారం చేపట్టబోయే పనుల గురించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏపీవో ధనంజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.